క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని దేశాయి బీడీ కంపెనీ ఎదుట బుధవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్‌ యూనియన్‌ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక గర్జన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ముత్తన్న మాట్లాడుతూ.. ఈనెల 4న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే కార్మిక గర్జనలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు నజీర్‌, శీను, మనోజు, లింబాద్రి, రవి, నర్సయ్య పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



నవీపేట: ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిగారపు మురళీకృష్ణ పిలుపునిచ్చారు. నవీపేటలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో అధికారికంగా మహాసభల తేదీని ప్రకటిస్తామన్నారు. నాయకులు గంగాధర్‌, రమేష్‌, జీవన్‌, నర్సింలు, నాగమణి, మల్లమ్మ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



బాల్కొండ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని మండలంలోని ఇత్వార్‌పేట్‌ గ్రామ రైతులు డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. సాగుకు మూడు గంటల కరెంట్‌ మాత్రమే సరిపోతుందంటూ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్‌ నేతలు బద్దం ప్రవీణ్‌రెడ్డి, రాజేశ్వర్‌ పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



మోర్తాడ్‌: ఎంపీ అర్వింద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్‌, నాయకులు భోగ దేవేందర్‌, తీగెల రమేష్‌, ప్రసాద్‌, కర్నె లక్ష్మినర్సయ్య, కుంట శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కమ్మర్‌పల్లి: పోడు భూముల పట్టాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని భీమ్‌గల్‌ ఏడీఏ మల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని అమీర్‌నగర్‌లో బుధవారం ఆయన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీలో రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు.

అసత్య ఆరోపణలు సరికాదు



వేల్పూర్‌: మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్‌ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌ నాయకులు పేర్కొన్నారు. వేల్పూర్‌ రైతు వేదికలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి చేసిన అభివృద్ధి పనులపై కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు సీబీఐ విచారణ జరిపించుకోవచ్చని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు నాగధర్‌రెడ్డి, మహిపాల్‌, రాములు, రాజేశ్వర్‌రెడ్డి, మహిపాల్‌, వైస్‌ ఎంపీపీ సురేష్‌ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్‌ పండుగ



మోర్తాడ్‌: ఏర్గట్ల మండలం బట్టాపూర్‌లో బుధవారం తీజ్‌ పండుగను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. గిరిజన యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి, భక్తి శ్రద్ధలతో పండుగను నిర్వహించారు. గిరిజన సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

- విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో హర్షం
- పొలం పనుల్లో బిజీబిజీ



ఆర్మూర్‌ పరిధిలోని పొలంలో వరి నాట్ల కోసం కేజ్‌వీల్‌ ట్రాక్టర్‌తో తొక్కిస్తున్న రైతు



పొలంలో బురదను కాడెద్దులతో గొర్రు ద్వారా చదును చేస్తున్న రైతు

ఆర్మూర్‌: వర్షాకాలం ప్రారంభంలో వానలు ఊరించి ఉసూరుమనిపించడంతో రైతులు ఆందోళన పడ్డారు. కానీ వర్షాలు మూడు రోజులుగా కురుస్తుండటంతో ప్రస్తుతం వారు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఆర్మూర్‌ నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో వర్షాకాలం ప్రారంభం నుంచి వ్యవసాయం పనులను ముమ్మరం చేశారు. కానీ ఆరుతడి పంటలు మొక్కజొన్న, సోయాబీన్‌ విత్తుకొనే సమయంలో ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు, పొలాలు వేసే సమయానికి ఊపందుకోవడంతో రైతులు ఉత్సాహంతో వరి నాట్లలో నిమగ్నమయ్యారు. బోరు బావుల నీటితో వరి పంట కోసం తుకంను రైతులు సైతం సిద్ధం చేసుకున్నారు. నెల రోజుల వ్యవధిలో పెరిగిన వారి నారును వేసుకోవడం కోసం ఆర్మూర్‌ ప్రాంత రైతాంగం వారం రోజులుగా బిజీబిజీగా కనిపిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు కురవడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టుకు నీరు చేరుతోంది. దీంతో ఈ నీరు గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా తమ గ్రామ చెరువుల నుంచి తమ పొలాల్లోకి చేరుతుండటంతో ఆరుతడి పంటల్లో వచ్చిన నష్టాన్ని అధిగమించాలనే లక్ష్యంతో రైతులు కష్టించి పనులు చేస్తున్నారు.



ఆర్మూర్‌ ప్రాంతంలో వరి నారు

వర్షాలపైనే ఆధారపడ్డాం..



వేసవిలో భూగర్భజలాలు అడుగంటినా, స్టోరేజీ ట్యాంకులు కట్టుకొని అష్టకష్టాలు పడి పంటలు పండించాం. ఇప్పుడు వర్షాలపైనే వ్యవసాయం ఆధారపడి ఉంది. వర్షాలు విస్తారంగా కురిస్తే రైతులకు మేలు.

– పెద్దకారు రాజు, రైతు, పెర్కిట్‌

రెండేళ్ల నష్టాన్ని భర్తీ చేయాలి..



ఆశించిన స్థాయిలో ఈ ఏడాది వర్షాలు కురిస్తే రైతులు రెట్టించిన ఉత్సాహంతో పంటలు పండించడానికి సిద్ధంగా ఉన్నారు. తొలకరి నిరాశ పర్చినా ఏతల సమయానికి వర్షాలు కురవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

– సత్యం రెడ్డి, రైతు, ఫత్తేపూర్‌

అడుగడుగునా గుంతలే..

- ప్రమాదకరంగా మారిన బోధన్‌–రుద్రూర్‌ ప్రధాన రహదారి



గుంతల రోడ్డుపై ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రుద్రూర్‌: బోధన్‌–రుద్రూర్‌ ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా మారింది. అలాగే వర్షపు నీరు గుంతల్లో నిలిచిఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా ప్రతి రోజు కోటగిరి, వర్ని, రుద్రూర్‌, పోతంగల్‌ మండలాల నుంచి పనుల నిమిత్తం వందల సంఖ్యలో బైక్‌పై ప్రజలు బోధన్‌కు వస్తుంటారు. రోడ్డుపై గుంతలు ఎంత లోతు ఉందో తెలియక పలువురు బైక్‌లు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళితే తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి





హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎమ్మెల్యే షకీల్‌.. మసీద్‌ పనులను పరిశీలిస్తున్న నేతలు

బోధన్‌: హైదరాబాద్‌లో బుధవారం ఎమ్మెల్సీ కవితను ఆమె స్వగృహంలో బోధన్‌ ఎమ్మెల్యే మహ్మద్‌ షకీల్‌ కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ స్పందించి నిధులు కెటాయిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

మసీద్‌ పనుల పరిశీలన..

హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో కొత్తగా నిర్మిస్తున్న రెండు మసీద్‌ నిర్మాణ పనులను హోంమంత్రి మహమూద్‌ అలీతో కలిసి ఎమ్మెల్యే షకీల్‌ పరిశీలించారు. వీటిని ఆగస్టు 25న సీఎం కేసీఆర్‌ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే తెలిపారు.

రైతుల స్థితిగతులపై చర్చకు సిద్ధమా?

- మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మానాల సవాల్‌



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

మోర్తాడ్‌(బాల్కొండ): బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో రైతు లు ఏ దుస్థితిలో ఉన్నారో తాము నిరూపిస్తామని, రైతు వేదికల వద్ద చర్చకు సిద్ధమా? అని మంత్రి ప్రశాంత్‌రెడ్డికి జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సవాల్‌ విసిరారు. మోర్తాడ్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలో తమ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్న మాటలను వక్రీకరించి ఉచిత విద్యుత్‌ తమ పేటెంటే అని ప్రచారం చేసుకుంటున్న బీఆర్‌ఎస్‌కు రైతులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్‌, బీజేపీల డ్రామాలు...

ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికి బీఆర్‌ఎస్‌, బీజేపీలు డ్రామాకు తెరలేపాయని, ఇరు పార్టీల నాయకులు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ సరికొత్త రాజకీయ విన్యాసాలను ప్రదర్శిస్తున్నాయని స్పష్టం చేశారు. కేంద్ర నిధుల దుర్వినియోగంపై ఎంపీ అర్వింద్‌ విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. జిల్లా కిసాన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముప్పడి గంగారెడ్డి, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముత్యాల రాములు, నాయకులు సుధీర్‌, బూత్‌పురం మహిపాల్‌, పుప్పాల అశోక్‌, గిర్మాజి గోపి, రాజ్‌కుమార్‌, నరేష్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ రైతుల దీక్షలు



బందల్ల రోడ్డు పై నాట్లు వేయిస్తున్న రైతులు

రెంజల్‌(బోధన్‌): మండలకేంద్రంలో బందల్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్‌ చేస్తూ 22 రోజులుగా స్థానిక రైతులు రిలే దీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు గొడుగులు పట్టుకుని తమ దీక్షలను కొనసాగించారు. కుర్మ సంఘం అధ్వర్యంలో ప్రతినిధులు దీక్షల్లో కూర్చున్నారు.

రోడ్డుపై నాట్లు వేసి, నిరసన

ఏకధాటి వర్షాలకు బందల్ల రోడ్డు బురదమయంగా తయారైంది. దీంతో స్థానిక రైతులు కూలీలతో కలిసి బురద రోడ్డుపై నాట్లు వేయించి నిరసన వ్యక్తం చేశారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు.

కొనసాగిన వరుణుడి జోరూ!





మాణిక్‌భండార్‌ వద్ద హైవేపై ప్రవహిస్తున్న వర్షపు నీరు.. అలుగు పారుతున్న చిక్కడపల్లి చెరువు



అలుగు పారుతున్న ఫతేనగర్‌ ఉప్పరోడి చెరువు



ఉధృతంగా ప్రవహిస్తున్న బొప్పాపూర్‌ వాగు

మాక్లూర్‌/రుద్రూర్‌/నవీపేట/బాల్కొండ/బోధన్‌ రూరల్‌/బోధన్‌: ఆర్మూర్‌, బాల్కొండ, బోధన్‌ నియోజకవర్గాల్లో గత మూడు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఆయా నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాలు బుధవారం జలమయం అయ్యాయి. చెరువులు, వాగులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. పలుచోట్ల చెరువులు నిండి అలుగుల గుండా నీరు ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఆరుతడి పంటల చేనుల్లో వర్షపు నీరు భారీగా నిలిచింది. పలు మండలాల్లోని శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోయాయి. దీంతో స్థానిక అధికారులు ఘటన స్థలాలను పరిశీలించి, వివరాలు సేకరించారు. బాధితులను ఇతర ప్రాంతాలకు తరలించారు. నవీపేట మండలంలో 86.2 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఇరిగేషన్‌ ఏఈ శ్రీధర్‌ తెలిపారు. ముప్కాల్‌లో 40 మి.మీ, బాల్కొండలో 56మి.మీ వర్షపాతం నమోదైంది.



సాలూర క్యాంప్‌ పంట కాలువలో వర్షపు నీరు



లంగ్డాపూర్‌ శివారులో పసుపువాగు ప్రవాహం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ఆర్మూర్‌టౌన్‌: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లు కూలిపోయే పరిస్థితి ఉంటే మున్సిపల్‌ అధికారులకు సంప్రదించాలని, వారికి పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని మున్సిపల్‌ కమిషనర్‌ ప్రసాద్‌చౌహాన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతర్గత రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు.

బోధన్‌లో ఉచిత వైద్యశిబిరం



బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని లయన్స్‌ కంటి ఆస్పత్రిలో బుధవారం బోధన్‌ ఎమ్మెల్యే షకీల్‌ సతీమణి అయేషా ఫాతీమా వెల్ఫేర్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 3వేల మంది హాజరు కాగా వైద్యులు వారికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి సుదర్శనం, ఉపవైద్యాధికారి విద్య సందర్శించారు. జెడ్పీ వైస్‌ చైర్మన్‌ రజితా యాదవ్‌, బీఆర్‌ఎస్‌ నేతలు రవీందర్‌యాదవ్‌, గంగారాం, ధూప్‌సింగ్‌, ఆస్పత్రి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డిపై పోటీకి కాంగ్రెస్‌ కార్యకర్త చాలు



మాట్లాడుతున్న యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు

ఆర్మూర్‌టౌన్‌: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్‌ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై పోటీచేసేందుకు కాంగ్రెస్‌ కార్యకర్త చాలని కాంగ్రెస్‌ యూత్‌ నాయకులు సయ్యద్‌ అవేజ్‌, మహమ్మద్‌ సోహైల్‌ అన్నారు. పట్టణంలో బుధవారం యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేను ఓడిస్తామన్నారు. నాయకులు షేక్‌పాషా, సల్మాన్‌, కళ్యాణ్‌కర్‌, దినేష్‌, విజయ్‌, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి





రుద్రూర్‌లో వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు.. బోధన్‌ పట్టణంలో..

రుద్రూర్‌/ఎడపల్లి/బోధన్‌/నవీపేట: జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, వివిధ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. ఆర్మూర్‌, బోధన్‌, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 14వ రోజు కొనసాగింది. రుద్రూర్‌లో జీపీ కార్మికులు ఎంపీడీవో, ఎంపీవోలకు వినతిపత్రాలను అందజేశారు. కోటగిరిలో జీపీ కార్మికులు ర్యాలీగా వచ్చి అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్‌ సతీమణి అయేషా ఫాతిమాను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌ గౌడ్‌, కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. జీపీ కార్మికుల సమ్మెపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ రావు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు మల్లేష్‌ డిమాండ్‌ చేశారు. నవీపేటలో జీపీ కార్మికులు భిక్షాటన చేసి, తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని కార్మికులు పేర్కొన్నారు.



ఎడపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మికులు



నవీపేటలో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

రుద్రూర్‌ ఎస్సై బాధ్యతల స్వీకరణ



రుద్రూర్‌: రుద్రూర్‌ ఎస్సైగా నీరేష్‌ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన రవీందర్‌ సీఐగా పదోన్నతి పొంది ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఎస్సై నీరేష్‌ ఆదిలాబాద్‌ జిల్లా సిరికొండ మండలం నుంచి బదిలీపై రుద్రూర్‌ వచ్చారు.

త్వరలో భీమ్‌గల్‌ డిపో పునఃప్రారంభం



భీమ్‌గల్‌: మండలకేంద్రంలో బస్‌ డిపోను త్వరలో పునఃప్రారంభిస్తారని స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు తెలిపారు. భీమ్‌గల్‌లో బుధవారం వారు విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. భీమ్‌గల్‌ డిపోపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఇటీవల రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌తో కలిసి మాట్లాడారని తెలిపారు. డిపోను త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రశాంత్‌రెడ్డి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, లక్ష్మణ్‌, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్‌



పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌(ఆర్మూర్‌)

- స్క్రీన్‌-1 – మహావీరుడు – (తెలుగు) – 11.50, 06.45, 10.10; మిషన్‌ ఇంపాజిబుల్‌ (ఇం) – 3.15
- స్క్రీన్‌-2 – సామజవరగమన(తెలుగు)–10.00, 4.10; రంగబలి (తెలుగు) 1.15; నాయకుడు – 7.10 ; బేబి – 10.25
- స్క్రీన్‌-3 – బేబి – 11.15, 2.50, 6.25, 10.00
- స్క్రీన్‌-4 – మిషన్‌ ఇంపాజిబుల్‌ (తెలుగు) – 11.00, 2.30, 6.00 9.30

సంక్షిప్తం

కుల సంఘ భవన నిర్మాణ ప్రదేశాల పరిశీలన

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మండలం కోమన్‌పల్లి గ్రామంలో కుల సంఘ భవన నిర్మాణాల ప్రదేశాలను పీఆర్‌ ఏఈ నితీష్‌ బుధవారం పరిశీలించారు. సర్పంచ్‌ నీరడి రాజేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన తల్వార్‌ అశోక్‌ ఇటీవల పొలంలో పనిచేస్తుండగా కరెంట్‌షాక్‌తో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి బుధవారం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో రూ. ఐదు లక్షల చెక్కును అందజేశారు. రుద్రూర్‌ ఏడీఈ రవికుమార్‌, ఏఈ నర్సారెడ్డి, శివప్రసాద్‌, ఫక్రుద్దీన్‌ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ..

భీమ్‌గల్‌: భీమ్‌గల్‌ మండలంలోని పలువురు బాధితులకు వైద్య చికిత్స కోసం ఎల్‌వోసీ మంజూరయ్యాయి. దీంతో సంబంధిత కాపీలను బుధవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి బాధిత కుటుంబాలకు అందించారు.

బాధిత కుటుంబానికి చేయూత

బోధన్‌: పట్టణంలోని ఆచన్‌పల్లిలో మంగళవారం అనిత అనే మహిళ ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో బాధిత కుటుంబానికి బుధవారం శక్కర్‌నగర్‌ లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు నిత్యావసర సరుకులు, నగదు అందించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వేల్పూర్‌: మండలంలోని పచ్చలనడ్కుడ పెద్దచెరువుకు, పెద్దవాగులోని చెక్‌డ్యాంకు ప్యాకేజీ 21 పైపులైను ద్వారా నీటిని అందించడంతో స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం సీఎం కేసీఆర్‌, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సర్పంచ్‌ ఏనుగు గంగారెడ్డి, ఎంపీటీసీ గంగాధర్‌, నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్‌ నేత చుక్కబొట్ల మోహన్‌ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో బుధవారం జరిగిన అంత్యక్రియలకు ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే మండవ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. దేగం యాదాగౌడ్‌, మాజీ జెడ్పీటీసీ గోపాల్‌ నగేష్‌, ఎర్రం ముత్యం, సాగర్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

జూలై 21న చలో కలెక్టరేట్‌

నందిపేట్‌: జీపీ కార్మికుల సమ్మెలో భాగంగా 21న చలో కలెక్టరేట్‌ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్‌ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

సైబర్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బాల్కొండ: సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ముప్కాల్‌ ఎస్సై చిన్న గంగారాం అన్నారు. ముప్కాల్‌ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ఆయన విద్యార్థులకు సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. సీ టీంల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.